వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 262 గురువారం | 25 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# చిరుద్యోగులపై.. చిన్నచూపు

- ఐదు నెలలుగా జీతాల్లేవ్..
- విద్యాశాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు
- నిధులున్నా చెల్లించేందుకు విముఖత
- మార్చి వరకు జీతం తీసుకున్న ఉన్నతాధికారి

విద్యాశాఖలో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులపై బాస్ కక్ష కట్టారు. చిన్న ఉద్యోగులంటూ చిన్నచూపు చూస్తున్నారు. నెల నెలా లక్షల రూపాయల జీతం తీసుకునే తను మాత్రం మార్చి-2024 వరకు జీతం తీసుకొని చాలీ చాలని వేతనంతో కాలం గడుపుతున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మాత్రం ఐదు నెలలుగా జీతాలు చెల్లించేందుకు విముఖత చూపుతున్నారు. నిధులున్నా చెల్లించేందుకు ఆయనకు చేతులు రావడం లేదు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై బూతు పురాణం అందుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ)కి చెడ్డపేరు తెచ్చేలా సదరు అధికారి వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంలో టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఎండీతోపాటు జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు తీర్చాలంటున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..





# హస్తం గూటికి మేయర్ సుధారాణి




కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగ్గారెడ్డి

ముందే చెప్పిన 'వరంగల్ వాయిస్'



కాంగ్రెస్‌లో చేరిన విద్యార్థి నేతలు

2లో





8లో..

## ముగిసిన నామినేషన్ల ఘట్టం

నామ పత్రాలు సమర్పించిన ప్రధాన పార్టీలు

స్వతంత్ర అభ్యర్థిగా బాబు మోహన్



8 లో..

## కేంద్రంలో మాదే అధికారం

- రాహుల్ ప్రధాని కావడం ఖాయం
- కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న మోడీ కి బుద్ధి చెప్పాలి
- బలరాం నాయక్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క


# చిరుద్యోగులపై.. చిన్న చూపు

**ఐదు నెలలుగా జీతాల్లేవ్..**

**విద్యాశాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు**

**నిధులున్నా చెల్లించేందుకు విముఖత**

**మార్చి వరకు జీతం తీసుకున్న ఉన్నతాధికారి**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాచక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) లో గత కొంత కాలంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది జీతాల్లేక తల్లడిల్లుతున్నారు. చిన్న ఉద్యోగులపై అందులో పనిచేస్తున్న పెద్ద బాస్ చిన్నచూపు చూస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. పెద్ద సార్ మాత్రం తనకు రావాల్సిన లక్షల రూపాయల జీతం మార్చి-2024 వరకు తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. బతుకుదెరువు కోసం అతి తక్కువ వేతనంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి మాత్రం నవంబర్-2023నుంచి జీతాలు చెల్లించడంలేదని ఆరోపిస్తున్నారు.



### 19మంది సిబ్బంది, ఉద్యోగులు..

టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో వివిధ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పణకు హైదరాబాద్ కు చెందిన సురక్ష సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్ట్ పద్దతిన కేటాయించారు. దీని పరిధిలోనే అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ వర్కర్లు, ఏఈలు మొత్తం 19మంది ఔట్ సోర్సింగ్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎంతో కాలంగా వీరు విద్యాశాఖ అనుబంధంగానే పనిచేస్తున్నారు.

### నవంబర్ నుంచి..

ప్రతి నెల వచ్చే చాలీ చాలని జీతంతో కాలం గడుపుతున్న 19మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులకు గత నవంబర్ మాసం నుంచి జీతాలు చెల్లించడం లేదు. ఇప్పటికే ఐదు నెలలు గడిచింది. ఏప్రిల్ నెల పూర్తయితే ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబాలను సాకలేక ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ఆకాశాన్ని అంటుతున్న ధరలు..మరో వైపు సమయానికి జీతాలు అందక కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొందని చెప్పుకొస్తున్నారు. గతంలో రెండు మూడు నెలలకు ఒకేసారి జీతం అందడంతో ఎలాగోలా కుటుంబాలను నుట్టుకొస్తున్నామని, ఇప్పుడు మాత్రం పరిస్థితి మరీ ధారుణంగా మారిందంటున్నారు. ఈ విషయంలో టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఎండీతోపాటు జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు తీర్చాలంటున్నారు.

### జీతాలు రానిది వాస్తవమే..

**– జాలి నరేందర్ రెడ్డి, ఈఈ**

విద్యాశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు రాని విషయం వాస్తవమే. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంది. ప్రభుత్వం నుంచి కొన్ని బిల్లులు రావాల్సి ఉంది. అందుకే ఆలస్యం అవుతోంది. త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తా.



# కేంద్రంలో మాదే అధికారం

**రాహుల్ ప్రధాని కావడం ఖాయం**

**కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న మోడీకి బుద్ధి చెప్పాలి**

**బలరాం నాయక్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలి**

**ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, ములుగు :** కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ములుగు, వెంకటాపూర్ మండలాల్లోని బండారు పల్లి, నర్సాపూర్, కేశవపూర్ గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్ళి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు పేదల కోసం పోరాడే రాహుల్ గాంధీ, బడ వ్యాపారులకు ప్రజా ధనాన్ని దోచిపెట్టే నరేంద్ర మోడీకి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. లక్షల కోట్ల రూపాయలు పేదల దగ్గర పన్నుల పేరుతో వసూలు చేసి కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసిన మోడీ కి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధానిక కావాలనుకుంటే యూపీఏ పదేళ్ల కాలంలోనే అయ్యేవారని, కానీ ఏనాడూ ఆయన పదవిని ప్రేమించలేదన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, యువకులు, విద్యార్థులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్ గాంధీకి తోడుగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హస్తం గూటికి మేయర్ సుధారాణి

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగ్గారెడ్డి**

**ముందే చెప్పిన 'వరంగల్ వాయిస్'**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి గురువారం హస్తం గూటికి చేరింది. గత మూడు నెలలుగా ఊగిసలాట కొనసాగినా ఎట్టకేలకు హైదరాబాద్ లోని గాంధీభవన్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి, కోదండ రెడ్డి సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు జగ్గారెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే అందరికంటే ముందుగానే మేయర్ చూపు..కాంగ్రెస్ వైపు అంటూ వరంగల్ వాయిస్ జనవరి 10 న ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆమె కదలికలను ఎప్పటికప్పుడు పాఠకుల ముందుంచింది. వరంగల్ వాయిస్ చెప్పిందే నేడు నిజమైంది. అయితే ఎవరి ఊహకందని విధంగా నగరానికి చెందిన నాయకులు, కార్యకర్తలెవ్వరూ లేకుండా ఒంటరిగా కాంగ్రెస్ పార్టీలో చేరడం కొసమెరుపు.


వరంగల్ వాయిస్, ఫైల్ ఫొటో..



## కాంగ్రెస్‌లో చేరిన విద్యార్థి నేతలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో బీజేపీ అరాచక, అవినీతి పాలనను తరిమికొట్టాలంటే అది కాంగ్రెస్ తోనే సాధ్యమని భావించిన తెలంగాణ ఉద్యమకారులు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నేతలు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కాకతీయ యూనివర్సిటీ జేఏసీ సీనియర్ నాయకులు డాక్టర్ దేవోజి నాయక్, జేఏసీ అధ్యక్షులు ఆంగోత్ వినోద్ లోక్ నాయక్, వైస్ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నేతలు తాళ్లపల్లి నరేష్ గౌడ్, భూక్యా రమేష్ నాయక్, మాలోతు వెంకన్న, గిరిజన రాష్ట్ర నేతలు అజ్మీరా వెంకట్, బానోత్ సునీల్ నాయక్, తిరుపతి నాయక్, భూక్య రవి రాథోడ్ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన బోడ డిన్న..

హనుమకొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఓరుగల్లు జన జాతర బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

# గంగమ్మ తల్లికి పూజలు

**పాల్గొన్న కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** శ్రీ గంగామాత ఆశీస్సులు, దీవెనలు ప్రజలందరిపై ఉండాలని 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. రంగశాయిపేటలోని బేస్తం చెరువు వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ గంగామాత దేవాలయ ప్రతిష్టాపన రెండో రోజు గురువారం కార్యక్రమంలో గుండు చందన పూర్ణచందర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా రంగశాయిపేటలోని బెస్తం చెరువు ప్రాంతంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ గంగామాత ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం శ్రీ గంగామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమంలో 42, 43వ డివిజన్ల ప్రజలందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గుండు చందన పూర్ణచందర్ కోరారు.

# ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్‌దే

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** ఎంపీ ఎన్నికల నేపథ్యంలో రాయపర్తి మండల పార్టీ కార్యాలయంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేసి మన అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్ పార్టీ దే అని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి గట్టిగా పని చెయ్యాలని గ్రామపార్టీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు భూక్య సమయ్యా నాయక్, గోపాల్ రెడ్డి, కృష్ణ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, నర్సింహ రెడ్డి, మహిళ నాయకులు, వివిధ గ్రామ పార్టీల అధ్యక్షులు, మండల పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# గౌతమ్ జూనియర్ కళాశాల ప్రభంజనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కళాశాల ధీటుగా ఫలితాలను సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో నాగపూరి హాసిని 438/440, 436, 435, 435, 433 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుకు సాధించడం జరిగింది. ఎంపీసీ ప్రథమ సంవత్సరం విభాగంలో 466/470, వేముల మల్లిక 465, 461, 461 రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంక్ ను సాధించారు. బైపీసీ సెకండ్ ఇయర్ లో 987/ 1000 వి.అభినయ మార్కులు సాధించగా, విద్యార్థిని విద్యార్థులను కళాశాల యాజమాన్యం సందరాజు సంతోష్, మంతెన భిక్షపతి , గొట్టె లక్ష్మణ్, బండి పరుశరామ్, మల్ల ధనుంజయ్, ఆంభీర శ్రీకాంత్‌లు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

# జన జాతర సభ విజయవంతం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిన్న మడికొండలో ఈనాడు ఆఫీస్ ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించిన సభలో వరంగల్ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఓరుగల్లు జనజాతర బహిరంగ సభను జయప్రదం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు జిల్లా ప్రజలకు, బహిరంగ సభను కవరేజ్ చేసిన ప్రింట్, ఫోటో , ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, ప్రతి ఒక్కరికి పేరు పేరునా వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ మహా నగరాన్ని అన్నిరంగాల్లో హైదరాబాద్ తరహాలో అంతర్జాతీయ నగరంగా జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ముఖ్యమంత్రి వరంగల్ మహానగరంపై వరాలు ప్రకటించడంపై ముఖ్యమంత్రికి హనుమకొండ జిల్లా ప్రజల పక్షాన నాయిని కృతజ్ఞతలు తెలిపారు.

# ఓరుగల్లులో తిరుగులేని ఏకశిలా విద్యాసంస్థలు

## విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరంతరమైన శ్రమ, పటిష్టమైన ప్రణాళిక ,సమిష్టి కృషి , ఒత్తిడి లేని బోధన విధానం, సహజ నైపుణ్యాన్నీ వెలికితీసే ప్రేరణ తరగతులు, సమాజ హితమైన అంశాలపై ప్రముఖ వ్యక్తులతో అవగాహనా సదస్సులతో పాటు, అత్యుత్తమమైన బోధనతో, క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం, నిరంతర యాజమాన్య పర్యవేక్షనతో ఇంటర్ ఫలితాలలోని అన్ని విభాగాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధిస్తూ, ఓరుగల్లులో తిరుగులేని విద్యాసంస్థలు మా ఏకశిలా విద్యాసంస్థలని ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డా.గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలతో పాటు, కాంపిటీటివ్ పరిక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఈప్ సెట్ లలో కూడా అత్యుత్తమ ఫలితాలను సాదిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డా.గౌరు తిరుపతి రెడ్డితో పాటు డైరెక్టర్ యం.జితేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సుధాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డితో పాటు బోధనా సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ లో 467/470 మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ పొందిన జే.లక్షణ , ఐఐటీలో సీట్ సాధించాలనే పట్టుదలతో కృషిచేస్తున్నాని, మా ఏకశిలా యాజమాన్యం, ప్రిన్సిపాల్ అన్నివేళలా అందుబాటులో ఉంటూ మమ్మల్ని విజయం సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నారని తెలిపింది. ఫస్ట్ ఇయర్ బైపీసీలో 436/440 మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ పొందిన వి.సంజన, నా లక్ష్యం ఎంబీబీఎస్ సాధించడమని మా కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం సలహాలు, సూచనలతో నేను సీట్ సాధిస్తానని ధీమా ఉంది. అదేవిదంగా క్రమశిక్షణతో కూడిన విధ్యావిధానంతో మమ్మల్ని ముందుకు నడిపించిన మా కళాశాల యాజామాన్యానికి కృతజ్ఞలు తెలియచేస్తున్నాను.

# మలేరియా వ్యాధిపై అవగాహన



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆశ జ్యోతి ఆధ్వర్యంలో వెలిశాల ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా వ్యాధి రాకుండా మందు జాగ్రత్తగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, పనికిరాని పాత్రలు, టైర్లు ,కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, దోమతెరలు వాడటం అలవర్చుకోవాలని తెలిపారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వినియోగించాలని, మలేరియాను మన దేశం నుంచి 2030 వరకు పారద్రోలడానికి దోమలను నిర్మూలించండి – దోమ కాటు నుండి రక్షించుకోండి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వైద్య సిబ్బందితో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశ జ్యోతి, ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ మధురిమ, హెచ్ఈఓ జమాలుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ కేవీ. కృష్ణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ బుచ్చిబాబు, ఫార్మసిస్ట్ విద్యాసాగర్, స్టాఫ్ నర్స్ చిత్ర, ఏఎన్ఎం రాజేశ్వరి, రేణుక, ఆశ వర్కర్ పావని, స్వప్న కాంటినెంట్స్ వర్కర్ లక్ష్మి, సారయ్య, కృష్ణస్వామి గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకెళుతున్న మారేపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం పబ్లిక్ గార్డెన్‌లో వాకర్స్ తో కలిసి మార్నింగ్ వాక్ లో భారత రాష్ట్ర సమితి ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం బీఆర్ఎస్ పార్టీ కల్పించిదని, ఎంతో మంది ఉద్యమ కారులకు నిలయమైన కాకతీయ విశ్వ విద్యాలయం, విద్యావంతులు, మేధావులు ఒకసారి ఆలోచించి నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజు యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తక్కల్లపల్లి సత్యనారాయణ రావు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

## జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం అని వరంగల్ జిల్లా స్వీప్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో15-వరంగల్ లోక్ సభ నియోజక వర్గ పరిధి 106%-%వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి సంబందించి స్వీప్-2024(సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో లీడ్ బ్యాంకు వారి సహకారంతో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా స్వీప్ నోడల్ అధికారితో కలిసి అదనపు కమిషనర్ అనుసుర్ రషీద్ తో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం వరంగల్ జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి వినూత్నంగా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ముగ్గుల ద్వారా ఓటర్లలో చైతన్యం తేవడానికి మెప్మా ఆధ్వర్యం లో లీడ్ బ్యాంక్ వారి సహకారం తో పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఓటు వేయడం అందరి బాధ్యత అని తెలియజేయడం కోసం ప్రధాన కూడళ్లలో రైల్వే స్టేషన్లు బస్ స్టేషన్లలో సెల్ఫీ పాయింట్ల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్నామని నోడల్ అధికారి తెలియజేశారు. ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న మహిళల చేత ఎన్నికల ప్రతిజ్ఞను నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ మెటీరియల్ నోడల్ అధికారి విజయలక్ష్మి, పీడబ్ల్యూడీ చీఫ్ నోడల్ అధికారి సత్య లక్ష్మి, సీడీపీఓ విశ్వజ, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సత్యం, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, వరంగల్ (తూర్పు) నియోజక వర్గ నోడల్ అధికారి రాజేష్ కుమార్, టీఎంసీ రమేష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకట రమణి, సీఓలు పాల్గొన్నారు.

# రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** వ్యవసాయ క్షేత్రంలోని రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయ అధికారి జయచంద్ర తో కలిసి వ్యవసాయ రంగంపై వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులకు స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అందుబాటులో ఉండాలని, వ్యవసాయంలో రైతులకు వచ్చే సమస్యలను పరిష్కరించాలని, సమస్య తీవ్రతను బట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ అంశాలలో రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. క్లస్టర్ల వారీగా ఉండే వ్యవసాయ అధికారులు స్థానిక ఫర్టిలైజర్ దుకాణాలలో ఉండే స్టాక్ పై దృష్టి పెట్టాలని, షాప్ యజమానులు మందులు కొనుగోలు చేసిన తరువాత రైతులకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. రైతుల భూముల స్వర్వే నంబర్ ఆధారంగా పంటల వారీగా క్రాప్ బుకింగ్ చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారులను ఈపాస్ ఏఈ ఓ లాగిన్ ఏ విధంగా పని చేస్తుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ములుగు మండలంలోని రామచంద్రపురం గ్రామంలోని దుబాసి చంద్రమౌళి ఫర్టిలైజర్ షాప్ ను సందర్శించారు. షాప్ లోని స్టాక్ వివరాలు, రశీదులు పరిశీలించారు. ఈపాస్ యంత్రాల పనితీరు, తదితర వివరాలను షాప్ యజమానిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఏడీ కే.శ్రీపాల్ , ఏటూరు నాగారం ఏడీ యన్.శ్రీధర్ , స్థానిక వ్యవసాయ అధికారి సంతోష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు గాంధీ బొమ్మ శాలువా బహూకరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లో నిన్న జరిగిన కాంగ్రెస్ జన జాతర సభ లో మంత్రి కొండా సురేఖ సమక్షంలో వరంగల్ కొత్తవాడలో మేము తయారు చేసిన మహాత్మా గాంధీ బొమ్మ 2 నెలలు అవిశ్రాంతంగా నేసిన చద్దరును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుకరించారు. చేనేత కళాకారుల అద్భుత నైపుణ్యానికి ముఖ్యమంత్రి పద్మశాలీలు కళాకారులే అన్నప్పుడు సురేఖ అక్క నవ్వులతో ఆనందం వెల్లివిరిసిందని చిప్ప వెంకటేశ్వర్లు నేత తెలిపారు. త్వరలో చేనేత సమస్యలపై ఒక వినతిని అందించే బాధ్యత తన భుజాలపై సురేఖ పెట్టిందన్నారు. ముఖ్య మంత్రి చేనేత కళాకారులను అన్ని విధాల ఆదుకుంటామని మాట ఇచ్చారు. చేనేత కార్మికుల పక్షాన మంత్రి సురేఖకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గుడుంబా తయారీని పూర్తిగా అరికడతాం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బెల్టు షాప్ లు, గుడుంబా స్థావరాలను నిర్వహించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ వరంగల్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.నాగేందర్ రావు హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాయలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 తండాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 250 కేజీల నల్లబెల్లం, 5 వేల లీటర్ల బెల్లం పానకం, 76 లీటర్ల నాటు సారాను స్వాదినం చేసుకొని 11 మందిని అదుపులోకి తీసుకున్నమన్నారు. అక్రమ బెల్లం, గుడుంబా తయారీదారులపై పీడీ యాక్ట్ తో పాటు ఇతర చట్టాలను కూడా ప్రయోగిస్తామన్నారు. పోలీసు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నల్లబెల్లం రవాణా, గుడుంబా తయారీని పూర్తిగా అరికడతామన్నారు. మద్యం షాప్ నిర్వాహకులు బీర్ బాటిల్లను ఎంఆర్ పీ ధరల కన్నా అధిక ధరలకు విక్రయిస్తే వైన్ షాప్ లను సీజ్ చేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.కిరణ్, సీఐ చిరంజీవిలు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మే 10న మహాత్మ బసవేశ్వరుడి జయంతి ఉత్సవాల నేపథ్యంలో వీరశైవ లింగాయత్( బలిజ) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, సంఘం అధ్యక్షుడు నానం రాజయ్య పేర్కొన్నారు. గురువారం హనుమకొండ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంఘం వ్యవస్థాపక సభ్యులైన బత్తుల రాజయ్య, పట్నం శెట్టి ఈశ్వరయ్య, పెనాల సమ్మయ్య, సాయం ఈశ్వరయ్యతో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి గుండవరం విధుమౌళి మాట్లాడుతూ చలివేంద్రంలో చల్లని త్రాగునీటితో పాటు ఎండ తీవ్రతను బట్టి బాటసారులకు మజ్జిగను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ చలివేంద్రాన్ని వీరశైవ లింగాయత్ లకు ఆరాధ్యుడైన బసవేశ్వరుని జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సంఘం నేతృత్వంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. కోశాధికారి సురేష్ బాబు మాట్లాడుతూ ఉదయం 11:30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చలివేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు పట్నం శెట్టి వీర సోమయ్య, కమ్మల సర్వేశ్వరరావు, పట్నం శెట్టి గౌరీ శంకర్, పరపతి సంఘం అధ్యక్షురాలు గౌరీ, కార్యదర్శి వెన్న కోటేశ్వరరావు, పరపతి సంఘం పూర్వ అధ్యక్షుడు సాయం సాంబయ్య, దుర్గం సమ్మయ్య, వనం కిరణ్, సాయం ఈశ్వరయ్య, జంగమ సమాజం వర్కింగ్ ప్రెసిడెంట్ మఠం సురేష్, బెలిగిని బసవయ్య ,మహిళా ప్రతినిధులు ఉష, శోభ తదితరులు పాల్గొన్నారు.

# గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని వెల్ది గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం గంగ తెప్పోత్సవం, గంపలు తీయుట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాదవ కుల సంఘ పెద్దలు రాపాక వెంకటయ్య, నక్కల ఆశయ్య, అధ్యక్షులు ఎలబోని ఐలయ్య, రాపాక శ్రీనివాస్, జక్కుల శ్రీనివాస్, జక్కుల అశోక్, ఎలబోని సారయ్య, నక్కల ఉపేందర్, జక్కుల రాజు, నక్కల యాదగిరి, నక్కల ఆశయ్య, రాపాక శ్రీనివాసు, రాపాక రాజు, శివ, వజ్జ అశోక్, మహేందర్, ఒగ్గు పూజారి, బర్మా రాము, గణేష్, కులపెద్దలు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# మలేరియాపై పోరాటం చేద్దాం

## వైద్యాధికారి గూగులోతు రవి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేద్దామనే నినాదంతో గురువారం మలేరియా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. అనఫిలిస్ అనే దోమలు కుట్టడం వలన మలేరియా జ్వరాలు వస్తాయని తెలిపారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి పరిసరాల పరిశుభ్రత పై అవగాహనా కల్పించాలిని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని, మురుగు నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేసి దోమలు లార్వాలు పెరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా జ్వరాలు వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించి వెంటనే రక్త పరీక్షలు చేయించి మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంత కుమారి, హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వర్లు, కృష్ణ, సుధాకర్, సుదర్శన్, శోభరాణి, లక్ష్మి, సాయిశ్రీ, సిరి, ఏఎన్ఎంఎస్ శ్రీదేవి, స్వప్న, అనిత, సోములు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ మహమ్మద్ అజీమ్ నిజాయితీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రావణి అనే మహిళ హనుమకొండ చౌరస్తా నుంచి షాపింగ్ కోసం అజీమ్ ఆటో ఎక్కి వరంగల్ చౌరస్తాలో దిగి హడావుడిలో తన బ్యాగును ఆటోలో మర్చిపోయింది. వెంటనే పోలీస్ స్టేషన్ కు మహిళా వచ్చి ఆ బ్యాగ్ లో నాలుగు తులాల బంగారం నెక్లెస్, రూ.40 వేల నగదు ఉందని ఏడుస్తుండగా అంతలోనే ఆటో డ్రైవర్ అజీమ్ ఆ బ్యాగ్ తో స్టేషన్ కి వచ్చి బ్యాగుతో పాటు నెక్లెస్, రూ.నగదును అప్పగించడం జరిగింది. తన గొప్ప మనస్సుని, నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ అజీమ్ ని సీఐ ఇంతే జార్ గంజ్ మచ్చ శివకుమార్ సిబ్బంది అభినందించారు. శ్రావణి తన కృతజ్ఞతలు అజీమ్ కి తెలియజేసి వెయ్యి రూపాయలు ఆటో డ్రైవర్ కు కానుకగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరూ అజీమ్ లాగే నిజాయితీగా ఎవరైనా ప్రయాణికులు తమ వస్తువులు ఆటోల మర్చిపోతే తిరిగి పోలీస్ స్టేషన్లో అప్పజెప్పాలని కోరారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి సుధీర్ కుమార్ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. గురువారం నడి కూడ మండలంలోని రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్, ధర్మారం, కౌకొండ, సర్వాపూర్, నార్లాపూర్ గ్రామాలలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, వైస్ ఎంపీపీ చందకుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ రవీందర్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జేఈఈ ఫలితాల్లో మణిదీప్‌కు 13వ ర్యాంక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరీలో వరంగల్ కి చెందిన విద్యార్థి సాంబారి మణిదీప్ కుమార్ 13వ ర్యాంక్, జనరల్ కేటగిరీలో 78వ ర్యాంక్ సాధించారు. మణిదీప్ తండ్రి సాంబారి సంజయ్ కుమార్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆల్ ఇండియా లెవల్ లో 13వ ర్యాంక్ సాధించిన మణిదీప్ ను స్నేహితులు, బంధువులు అభినందించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దవంగర మండలం వడ్డేకోతపల్లి గ్రామానికి చెందిన ముత్తినేని రమాదేవి, శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, తంగేళ్లపల్లి మల్లికార్జున చారి, రైతు సమన్వయ కమిటీ చైర్మన్ వారితో పాటు 25 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉపాధ్యక్షుడు మురళి, ముఖ్యనాయకులు, మాజీ సర్పంచ్ లు, యూత్ నాయకులు, సోషల్ మీడియా మిత్రులు, ముఖ్య నాయకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు సమ్మర్ క్యాంపు ప్రారంభం



**వరంగల్ వాయిస్, పరకాల :** అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పరకాల ఏసీపీ కిషోర్ కుమార్‌ను గురువారం ఆహ్వానించారు. రేపు సాయంత్రం ఐదు గంటలకు అంగరంగ వైభవంగా ఏసీపీ చేతుల మీదుగా ఈ శిబిరాన్ని ప్రారంభించడం జరుగుతుందని అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఏసీపీని ఆహ్వానించిన వారిలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ సామాజిక సేవకుడు అమ్మ అశోక్, దాసరి రవి, నాగేల్లి సురేష్, రాసమల్ల కృష్ణ, పాలకుర్తి శ్రీకాంత్, దుమల గణేష్, ఏరెడ్డి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కోమల్ల గ్రామంలో స్వర్గీయులైన వల్లాల వెంకటయ్య భౌతిక కాయాన్ని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్లు కొమురయ్య గురువారం సందర్శించి వారి కుమారులు అశోక్, చంద్రమౌళి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నర్రా, అనిల్ కార్యదర్శి బంధ మహేందర్, మాజీ అధ్యక్షుడు బోల్లపల్లి, ఎల్లయ్య, నరసయ్య, కనకయ్య వెంకటస్వామి, బోల్లపల్లి యాదగిరి, బస్కుల బాబు, నల్ల యాకూబ్, బోల్లపల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యకరంగా, వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు కుట్టటం వల్ల మలేరియాతో పాటు ఇతర ప్రమాదకరమైన వ్యాధులకు ఎంతోమంది గురి కావాల్సి వస్తుందని తెలిపారు. మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీరు నిల్వ ఉండకుండా చూసుకున్నట్లయితే దోమ లార్వాలు పెరగకుండా చూసుకొని వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి కిటికీలకు, డోర్లకు మెష్ ఏర్పాటు చేసుకున్నట్లయితే దోమల బారి నుంచి చాలా వరకు రక్షించుకోవచ్చన్నారు. ఆల్ అవుట్ లాంటి రిపెంలెంట్స్ వాడటం ఆరోగ్యానికి హానికరమని తెలుపుతూ ప్రకృతి సిద్ధమైన వేప పొగ ద్వారా పరిసరాలలో దోమలు రాకుండా చూసుకోవచ్చని తెలిపారు. ఎప్పటికప్పుడు మీ నివాస ప్రాంతాల్లో శానిటేషన్ పనులను సక్రమంగా జరిగేటట్లు చూసుకోవాలని ఆయన కోరారు.

# ప్రతి ఓటరు ప్రజాస్వామ్య కాపలదారుడే

### డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, ఇనుగుర్తి :** ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటరూ కాపలదారుడేనని, అరాచకంపై వేటు వేయాలంటే సమర్థులకు చోటు తగ్గాలంటే ఓటుతోనే సాధ్యమని, ప్రజల తలరాతను మార్చే విలువైన ఆయుధం ఓటు మాత్రమేనని, డబ్బు ఇతర ప్రలోభాలకు అమ్ముకోకుండా సమర్థుడిని, సామాజిక స్పృహ గల వ్యక్తిని ఎన్నుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు, జాతీయ అవార్డు గ్రహీత– డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి చుక్కల ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఓటరు చైతన్య సదస్సులో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్తు బాగుపడాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందాలన్నా, విలువలతో కూడిన సమర్థ ప్రభుత్వ ఏర్పాటు కావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మంచి నాయకున్ని ఎన్నుకోవడానికి, తద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి– ప్రజలకు దక్కిన ఆయుధం ఓటేనని, ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటాలంటే ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతపై రచించిన పోస్టర్లు, కరపత్రాలను అతిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వినుకొండ శ్రీనివాస చారి, మాజీ సర్పంచ్ నరహరి, గ్రామ సభ్యులు రణధీర్ రెడ్డి, రాకేష్, ఎల్లమ్మ, లక్ష్మయ్య, ఆశా వర్కర్లు గీత, ఆదిలక్ష్మి, అంగన్వాడి టీచర్లు సరూప,మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'స్వీయ ఆవిష్కరణ' పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ విద్యుత్ భవన్ , నక్కలగుట్టలో గురువారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి చేతుల మీదగా రిటైర్డ్ డివిజినల్ ఇంజినీర్ యెర్రం మోహన మురళి రచించిన జీవన తరంగాలు 'స్వీయ ఆవిష్కరణ' పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ తన జీవితంలో ఎదురైనా సమకాలీన పరిస్థితులపై విపులంగా రాసిన పుస్తకమని తెలిపారు. మోహన మురళి తనను తానుగా చాలా ప్రస్ఫుటంగా పుస్తకంలో ఆవిష్కరించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజియం టి.మధుసూదన్, జీయం.మల్లికార్జున్, డీఈలు శ్రీకాంత్, అమర్ నాధ్, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు

## సివిల్స్ ర్యాంకర్ కొయ్యడ ప్రణయ్‌ను సన్మానించిన గవర్నర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఐఏఎస్ ర్యాంక్ సాధించిన కొయ్యడ ప్రణయ్ కుమార్ ను, వారి తల్లిదండ్రులను గవర్నర్ రాధాకృష్ణన్, ఐఏఎస్ బాల మాయా దేవి, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశ్వర్లు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి లక్ష్మి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని రామచంద్రపురం, 14, 13, వార్డులలో స్వీఫ్ ఆక్టివిటీస్, ద్వారా ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారి, అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు పట్టణం, జిల్లాలోనీ పంచాయతీల్లో, వార్డుల్లో ప్రతి ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తు అవగాహన, ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని, స్వీప్ నోడల్ అధికారి జినుగు మరియన్న గురువారం తెలిపారు. పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కళావతి భాయ్, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. స్వయం సహాయక బృందాలు, మెప్మా, ఆశా వర్కర్లు, ఎన్ఎంలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, స్త్రీ , శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, కాలేజీలు, రైల్వే స్టేషన్స్, ప్రధాన కూడళ్లలో తెలంగాణ సాంస్కృతిక సారథులు, పాటల ద్వారా, ప్రచార రథాలు, కరపత్రాలు, ఆడియోల ద్వారా, ర్యాలీలు, సభలు, సమావేశాలు, రంగోలీల ద్వారా ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నేపథ్యంలో 100 శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నట్లు స్వీప్ నోడల్ అధికారి తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథులు మెర్గు రవీందర్ గౌడ్, బండ వెంకన్న, బీఎల్ఓలు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ పబ్లిక్ స్కూల్ పై కేసు నమోదు చేయాలి

### గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ లు కేసు నమోదు చేయాలనీ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలాల్లో ఉన్న ఐపీఎస్ లో అడ్మిషన్ పొందిన విద్యార్థి తల్లి దండ్రులకు మాయ మాటలు చెప్పి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న అమాయకులకు ఎర వేసి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించి ఆ స్కూల్ యామాన్యం ఆ రూపాయలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూములు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రుల డబ్బులతో విలాసవంతమైన కార్లు, ఇండ్లు కొని ఆహ్లాదకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని మండిపడ్డారు. కాని పెట్టుబడి పెట్టిన తల్లిదండ్రులు మాత్రం వ్యవసాయ భూములు అమ్ముకొని పెట్టుబడి పెడితే ఇప్పుడు వాళ్లు రోడ్డు నా పడే పరిస్థితులు వచ్చాయని తల్లిదండ్రులు వెళ్లి అడిగితే బూతులు తిడుతూ మీకు దిక్కున్న చోట చెప్పుకో అని బెదిరిస్తున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆ తల్లిదండ్రులకు రావలసిన వాటా ఇప్పించి, వారిని మోసం చేసిన ఐపీఎస్ యాజమాన్యంపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగాఉద్యమాలను ఉధృతంచేస్తామని ఆయన తెలిపారు.

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 25, ఏప్రిల్ 2024
www.warangalvoice.net

# మాదిగ జాతి అంతా కాంగ్రెస్ పార్టీ వైపే




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పది సంవత్సరాలు వర్గీకరణకు తూట్లు పొడిచిన బీఆర్ఎస్, బీజేపీల దొంగ నాటకాలను ఓటుతో మాదిగ జాతి బిడ్డలు సమాధానం చెప్పాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజాబాబు అన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీ సారి వర్గీకరణ చేస్తామని చెప్పుడు, ఎన్నికలు అయ్యాక మోసం చేసుడు రెండు పార్టీలకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. బీజేపీ పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు వర్గీకరణ చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ లో సభ పెట్టీ వర్గీకరణకు మద్దతు తెలిపారు. కమిటీ వేస్తామన్నారు. ఆ తర్వాత, ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు కమిటీ కూడా వేయలేదని, ప్రధాన మంత్రి వర్గీకరణ పై మాట తప్పితే ఇంతకన్నా ఘోరం ఏమైనా ఉంటుదా అని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ను మాదిగ జాతి బిడ్డలు నమ్మరని, మరొక్కసారి వీళ్ల చేతిలో మోసపోడానికి మాదిగలు సిద్దంగా లేరన్నారు. కొంతమంది చిల్లర విమర్శలు ఎన్ని చేసినా మాదిగలు అంత కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో కనీసం మాదిగ బిడ్డలు ఎంతో మంది ఎమ్మెల్యేలుగా ఉన్న కనీసం ఒక్కరికీ కూడా మంత్రిపదవి ఇవ్వకుండా మాదిగ ఎమ్మెల్యేలను పదేండ్లు బానిసలుగా చూసిన బీఆర్ఎస్ ను మాదిగ సమాజం ఎలా నమ్ముతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాదిగ ఐనా దామోదర రాజనరసింహను ఆరోగ్య శాఖ మంత్రిని చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి నీ చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలు అని విమర్శించారు. అధికారం ఉన్నపుడు మాదిగలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు అధికారం పోగానే మాదిగలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్ని డ్రామాలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా మాదిగలు వారిని నమ్మరని అన్నారు. తప్పకుండా రాబోయే ఎన్నికలో పెద్ద పల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయమైందని, కాబట్టే, ప్రత్యర్థులకు నిద్రపడ్డటం లేదన్నారు. అందుకే మాదిగలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. మాదిగ సమాజమంతా కాంగ్రెస్ పార్టీకి జై కోడుతుందని, మరొక్కసారి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అండగా ఉంటామని మాదిగలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలక పాత్ర వహించిన ఇదే జాతి పార్లమెంట్ ఎన్నికలో కూడా సత్తా చాటుతుందని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజాబాబు అన్నారు. ఈ కార్యక్రమములో అన్నారం ఎంపీటీసీ దుర్గయ్య, మండల ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శంకర్ మద్దులపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎంపీ ఎన్నికలను ప్రశాంతంగా, ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి జిల్లాలో ఏర్పాటు చేసిన బృందాలన్ని పనిచేయాలని జిల్లా ఎన్నికల జనరల్ అబ్సర్వర్ రచిత్ రాజ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపుకు ఏర్పాటు చేయనున్న గదులను సందర్శించిన ప్రత్యేక జనరల్ అబ్జర్వర్ రచిత్ రాజ్ మాట్లాడుతూ తన వాహనం సైతం చెక్ పోస్ట్ వద్ద ఆపి తనిఖీ చేసినట్టు స్వయంగా ఆయనే తెలియజేశారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంలలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. అంతే కాకుండా జిల్లాలో అన్ని చెక్ పోస్ట్ వద్ద క్షేత్ర స్థాయిలో వాహన తనిఖీలు నిర్వహిస్తునట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎష్ పండరీ చేతన్, డీఎస్పీ తిరుపతి రావు, అధికారులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్లను 23శాతం నుంచి 42శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోకసభ ఎన్నికల తర్వాత జూన్ నెలలో గ్రామ పంచాయతీల ఎన్నికలు ఆ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో కుల గణన నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. శాసనసభ కూడా ఆమోదం తెలిపింది. కానీ కులగణన ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. యుద్ధ ప్రాతిపదికన కులగణన నిర్వహించాలన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కలిగిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ బీసీల మద్దతుతోనే అధికారంలోకి వచ్చిందనేది వాస్తవం. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం బీసీలకు సామాజిక న్యాయం కలగజేస్తామని చట్టసభల్లో ప్రాతినిధ్యం కలిగిస్తామని ఆర్భాటంగా చెప్పిననదే తప్ప ఆచరణలో నిరాశే మిగిల్చిందన్నారు.న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీసీలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు.

# అరూరి రమేష్ ఎంపీగా గెలవడం ఖాయం

## ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లీమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరూరి రమేష్ కుమద్దతు తెలియజేయడానికి ఈ దేశంలోనే దైవ భూమి అయిన ఉత్తరాఖండ్ నుంచి ఇక్కడికి రావడం జరిగిందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, అరూరి రమేష్ కు మద్దతు తెలియజేస్తూ వీరిని ఆశీర్వదించడానికి ఇంతటి 45 డిగ్రీల ఎండలో ఇక్కడికి విచ్చేసిన ప్రలజకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడి జనాన్ని చూస్తుంటే అరూరి రమేష్ ఘన విజయంతో పార్లమెంట్ సభ్యుడిగా గెలవడం ఖాయమని స్పష్టం అవుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నరేంద్ర మోదీ తన పాలనలో ప్రపంచంలో భారతదేశం గౌరవాన్ని పేరు ప్రఖ్యాతలు, ప్రతిష్టను పెంచారు. మోదీజీని ఆశీర్వదించండి.. తెలంగాణ సంక్షేమాన్ని మోదీ చూసుకుంటారన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో 400 సీట్లలో విజయం సాధిస్తామని, మోదీజీ మూడోసారి ప్రధానమంత్రి కానున్నారని ధీమా వ్యక్తం చేశారు. – కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అరూరి రమేష్ ను అఖండ మెజారిటీతో గెలిపించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వరంగల్ ఎంపీ స్థానాన్ని బహుమతిగా అందించండని పిలుపునిచ్చారు.



## అరూరి రమేష్ గెలుపునకు కృషి చేస్తాం

**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎలక్షన్ గెలుపు పై పరకాల రూరల్ మండలంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ అరూరి గెలుపు కోసం అందరం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పరకాల రూరల్ మండలఅధ్యక్షుడు ముష్కే దేవేందర్, మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ విద్యార్థుల హవా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సుగుట్టలోని మహాత్మా జ్యోతిబా ఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ (బాలికల) గురుకుల కళాశాల విద్యార్థినులు ఇంటర్‌లో సత్తాచాటారు. ప్రథమ, ద్వితీయ వార్షిక ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం ఇంటర్ బోర్డు ప్రకటించిన రిజల్ట్‌లో అత్యధిక మార్కులు సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరంలో ఎస్.ప్రీతి 440 మార్కులకు గాను 434 సాధించారు. సీహెచ్. సౌమిక 443, కె.ఐశ్వర్య 424 మార్కులు పొందారు. ఎంపీసీలో జి.శైయినిశ్నా 470 మార్కులకు 467లతో కళాలలో టాపర్‌గా నిలిచారు. కె.చందన 466, జి.నవ్యజ్యోతి 466, కె.జస్నిత 465, బి.శ్రీజ 464, ఎన్.లక్ష్మీప్రసన్న 463, కె.ఐశ్వర్య 463, కె. హారిక 462 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో సీహెచ్.సంశయ 1000 మార్కులకు 984 సాధించారు. ఎ.మానస 984, సీహెచ్.నవనేస్తం 982, ఎ.తరళిక 979, ఎ.శ్రీజ 977, ఆర్.పూజిత 974 ఎక్కువగా మార్కులు స్కోరు చేశారు. బైపీసీలో బి.రిషిత 990, ఎం. వర్షిత 980, ఎస్.నవ్య 977, పి.వర్ష 975, కె.అక్షిత 973 కళాలలో అత్యధిక మార్కులు సాధించారు. సీఈసీ ఇంటర్ మొదటి సంవత్సరంలో వి. ప్రతిభ 500 మార్కులకు 476, ఆర్.నిహారిక 472, సీనియర్ విభాగంలో వి.భవాని 931 మార్కులు స్కోరు చేసి కళాశాలకు పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ జనగామ అంజిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయిల ఉత్తమ బోధనతోపాటు విద్యార్థినులు పట్టుదలతో చదవడంతోనే అధికంగా మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థినులపై నిరంతరం పర్యవేక్షణతో మంచి మార్కులు స్కోరు చేసి కళాశాలకు పేరు తీసుకువచ్చారని, వారికి అభినందనలు తెలిపారు.

## టెండర్ల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండ ములుగు రోడ్డులోని బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థలోని ఐటీఐ స్మార్ట్ అగ్రిక ల్చర్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో వివిధ వస్తువులు టూల్స్, ఎక్విప్మెంట్, మిషనరీ కొనుగోలు చేసేందుకు ఆన్ లైన్ వెబ్ సైట్ %ఫ్ట్రజూ:7/వఅసవత్.వశ్రీఖఅ-స్త్రుఖఝ.స్త్రశీజ.ఱఅ% ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ(బాలికలు) వరంగల్ ప్రిన్సిపాల్ జి.సక్కు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల స్వీకరణకు చివరి తేది ఈనెల 29 ఉదయం 11 గంటల వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఆప్కో మాజీ చైర్మన్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నేత మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు నేత గురువారం హైదరాబాదులోని గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్ లో సీనియర్ నేత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అతనికి స్వాగతం పలికి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యమాల పోరాట గడ్డ చేర్యాల, జనగామ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపరు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థి విజయం కోసం పనిచేస్తానని ఆయన వివరించారు.



## రామాయణం కోసం శ్రమిస్తున్న రణ్‌బీర్

'యానిమల్'తో సూపర్ హిట్ అందుకున్న రణ్‌బీర్ కపూర్ తర్వాత సినిమా కోసం సిద్ధమవుతున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ వ్యయంతో రూపొందించనున్న 'రామాయణ'లో ఆయన లుక్ కోసం జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఎంతోమంది సెలబ్రిటీల వ్యక్తిగత ట్రైనర్ శివోహం.. 'యానిమల్' నుంచి 'రామాయణ' వరకు రణ్‌బీర్ ఎంతో చమటోడ్చినట్లు రాసుకొచ్చారు. 'మూడు సంవత్సరాల నుంచి రణ్‌బీర్ ఎంతో కష్టపడుతున్నారు. జీవితంలో షార్ట్‌కట్‌లు తీసుకోవడం వల్ల సాధించేదేమీ లేదు. మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి తగిన ప్రణాళిక అవసరం. ఆయన సంకల్పం చాలా గొప్పది. మీతో ఇన్నేళ్ల నా ప్రయాణం మర్చిపోలేని జ్ఞాపకాలను ఇచ్చింది. తదుపరి బ్లాక్‌బస్టర్‌కు ముందుగానే శుభాకాంక్షలు' అని రాసుకొచ్చారు. 'యానిమల్' లుక్‌ను కొత్త ఫొటోతో పోలుస్తూ ఒక ఇమేజ్‌ను షేర్ చేశారు. దీనికి 'రామాయణ ది ఫిల్మ్' అనే హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ లుక్ అదిరిపోయిందంటూ నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. ఇటీవలే రణ్‌బీర్ విలువిద్య నేర్చుకుంటున్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ చిత్రం కోసం ఆయన  కొన్ని రోజుల పాటు మాంసాహారం, మద్యపానం మానేశారు. ఇందులోని నటీనటులు లుక్‌లు లీక్ కాకుండా ఉండేందుకు సెట్స్‌లోకి సెల్‌ఫోన్‌లను నిషేధించారు. దీనికి తెలుగు వెర్షన్ సంభాషణలు రాసే బాధ్యతను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కు అప్పగించినట్లు సమాచారం. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మూడు భాగాలుగా దీన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. తొలి పార్ట్‌ను 2025 దీపావళికి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.





## గోట్ సినిమా కోసం శ్రీలీలకు ఆఫర్ ?

దర్శకుడు వెంకట్ ప్రభు సినిమాలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. టెక్నికల్‌గా హైలో ఉంటుంది. స్క్రీన్ మొత్తం నటీనటులు కనిపిస్తారు. విజయ్‌తో ఆయన తెరకెక్కిస్తున్న గోట్ చిత్రంలోనూ ఇవి కొనసాగుతున్నాయని టీమ్ చెబుతోంది. ఈ చిత్రం తర్వాత తన 69వ చిత్రం చేసి విజయ్ నటనకు స్వస్తి పలకనున్నారనే టాక్ కొంతకాలంగా వినిపిస్తోంది.వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. నటి మీనాక్షి చౌదరి, స్నేహ, లైలా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, వైభవ్, ప్రేమ్‌జీ, మైక్ మోహన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న వినాయక చవితి సందర్భంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ వర్గాల నుంచి సమాచారం. అయితే ఈ చిత్రం గురించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఇందులో ఓ పత్యేక పాత్రలో త్రిష తళుక్కుమన బోతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడా స్పెషల్ అప్పీరియన్స్‌ను ఇవ్వడానికి టాలీవుడ్ క్రేజీ నటి శ్రీలీలతోచర్చలు జరుగుతున్నట్లు మరో వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అంతే కాదు. ఇందులో శ్రీ లీలకు ప్రత్యేకంగా ఒక పాట కూడా ఉందని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా  రాలేదు. ఇదే నిజం అయితే శ్రీలీల కోలీవుడ్ ఎంట్రీ చిత్రం గోట్ అవుతుంది. అలాగే తమిళ స్టార్ అజిత్‌తో జత కట్టడానికి రెడీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## వారం తర్వాత అలవాటుపడ్డాను

షాహిద్ కపూర్ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'జెర్సీ'. నాని కథానాయకుడిగా తెలుగులో వచ్చిన 'జెర్సీ' రీమేక్‌గా రూపొందింది. ఇందులో షాహిద్ సరసన మృణాల్ ఠాకూర్ నటించారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమాలోని ఓ సన్నివేశాన్ని గుర్తుచేసుకున్నారు.'నేను షాహిద్ కపూర్‌కు అభిమానిని. ఆయనతో కలిసి నటించే అవకాశం రాగానే వెంటనే ఓకే చెప్పాను. మొదటిరోజు షూటింగ్‌లో ఆయన నవ్వు చూస్తూ చాలాసేపు అలానే ఉండిపోయా. మీ నవ్వు తెరపై ఎలా ఉందో నిజంగా కూడా అలాగే ఉందని చెప్పాను. ఆయనతో నటించిన రోజులను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. మంచి కో-స్టార్. అంతపెద్ద స్టార్‌తో నటించాలంటే మొదట ఇబ్బందిగా అనిపించింది. వారం తర్వాత అలవాటుపడ్డాను. ఆ సినిమాలో ఒక సన్నివేశంలో నటించాలంటే చాలా భయపడ్డాను. అందులో షాహిద్ కపూర్‌ను కొట్టే సన్నివేశం చాలా కఠినమైనది. నేను నిదానంగా కొడతాను.. మీరు ఎడిట్ చేసుకోండి అని సూచించాను. దానికి దర్శకుడు అంగీకరించలేదు. ఈ సీన్‌కు షాహిద్ చాలా సపోర్ట్ చేశారు. 'మీ మాజీ బాయ్‌ఫ్రెండ్‌ను గుర్తుచేసుకుని నన్ను చెంపదెబ్బ కొట్టండి' అని సరదాగా చెప్పారు. ఆ సన్నివేశాన్ని కేవలం రెండు కెమెరాలతో చిత్రీకరించారు. మూడు గంటల సమయం పట్టింది' అని గుర్తుచేసుకున్నారు. సంవత్సరానికి 5 సినిమాల్లో నటించాలనే కోరికేం లేదని.. చేసిన ఒక్క చిత్రమైనా ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తిండిపోతే చాలన్నారు. తాజాగా విజయ్ దేవరకొండతో కలిసి 'ఫ్యామిలీస్టార్'తో సందడి చేసిన మృణాల్ ప్రస్తుతం బాలీవుడ్‌లో ఒక సినిమా చేస్తున్నారు.

## నమ్మ బెంగళూరు ఆట చూస్తావా?

### వాణిజ్య ప్రకటనలతో మహేశ్ బాబు బిజీ



సూపర్‌స్టార్ మహేష్ సినిమాలు చేస్తూనే మరోపక్క వాణిజ్య ప్రకటనలు, వ్యాపారాలతోనూ బిజీగా ఉన్నారు. ఇప్పటికే ఆయన హైదరాబాద్‌లో ఏషియన్  సంస్థతో కలిసి ఏఎంబి సినిమాస్ పేరుతో మల్టీప్లెక్స్‌ని నిర్వహిస్తున్నారు. ఏషియన్ మహేష్ బాబు మల్టీప్లెక్స్ అనగానే ఒక ల్యాండ్ మార్క్ అయిపోయింది.  ఇప్పుడు మహేష్ బాబు తన బిజినెస్‌ని మరింత పెంచుతున్నారు. మరోసారి ఏషియన్ సంస్థతో కలిసి ఇదే ఏఎంబి పేరుతో బెంగళూరులో మల్టీప్లెక్స్ మొదలు పెట్టబోతున్నారు. ఇక ఈ మల్టీప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఏషియన్ సంస్థ ఒక అధికారిక ప్రకటన రిలీజ్ చేసింది. ఈ పూజా కార్యక్రమాలలో ఏషియన్ సంస్థ చీఫ్ సునీల్ నారంగ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు, కన్నడ నిర్మాత రాక్‌లైన వెంకటేష్ ఉన్నాయి. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే మహేష్‌బాబు కుటుంబ సభ్యులు ఎవరూ ఈ వేడుకలో పాల్గొనలేదు.  'నమ్మ బెంగళూరు ఆట చూస్తావా? మీ అభిమాన ఎఎంబీ సినిమాస్ ఇప్పుడు బెంగళూరులో అడుగుపెట్టబోతోంది. నేడే పూజా కార్యక్రమాలు జరిగాయి' అని ఎఎంబీ సినిమాలో అధికారిక ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన పోస్ట్‌కు మహేష్ రీపోస్ట్ చేశారు.

# ముగిసిన నామినేషన్ల ఘట్టం





## నామ పత్రాలు సమర్పించిన ప్రధాన పార్టీలు

## స్వతంత్ర అభ్యర్థిగా బాబు మోహన్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికలకు మొదటి ఘట్టం పూర్తయింది. గురువారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామ పత్రాలను సమర్పించారు. వరంగల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేష్, బీఆర్ ఎస్ అభ్యర్థిగా డాక్టర్ ఎం.సుధీర్ కుమార్, మహబూబాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలరాం నాయక్, బీజేపీ అభ్యర్థిగా అజ్మీర సీతారాం నాయక్, బీఆర్ ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత నామినేషన్ దాఖలు చేశారు. కాగా చివరి రోజు స్వతంత్ర అభ్యర్థిగా సినీ హాస్య నటుడు పల్లి బాబు మోహన్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అదే విధంగా బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ తరపున 4వ సెట్ నామినేషన్ పత్రాలను ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, కుడా మాజీ చైర్మన్లు సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి సమర్పించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పసుల రవి ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రూప పోలేపాక, ఎంసీపీఐయూ అభ్యర్థిగా కొత్తపల్లి సావిత్రి రెండో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీఎస్పీ అభ్యర్థిగా పంజా కల్పన 3వ, 4వ సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అదే విధంగా మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థిగా అజ్మీర సీతారాం నాయక్ గురువారం మూడో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు సమర్పించారు.















# మేయర్ రాకను వ్యతిరేకిస్తున్నాం

## విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు

## అధికారం కోసమే అంటూ విమర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఆరోపించారు. గురువారం రాంకీలోని గుండేటి నరేందర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తూర్పు నియోజకవర్గం పరిధిలోకి పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని మేయర్ రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. సుధారాణి చెల్లని రూపాయితో సమానమన్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను కాదని కాంగ్రెస్ పార్టీలో ఎలా చేరుతారంటూ ప్రశ్నించారు. బీఆర్ ఎస్ లో అమెను నిరాకరించడంతోనే కాంగ్రెస్ లోకి ఒంటరిగా వచ్చి చేరారని విమర్శించారు. సుధారాణి పార్టీలోకి వస్తే పార్టీ కలుషితం అవుతుందని హెచ్చరించారు. ఆమె అహంకారపురితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికారాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పటికీ అవిశ్వాసం పెట్టి తీరుతామని హెచ్చరించారు. ఆమెను గద్దె దించడమే లక్ష్యం అని పేర్కొన్నారు.

# 27న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

## షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఈ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మే 2న జారీ కానుంది. మే 2 నుంచి 9వ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణ ఉంటుంది. ఈ ఉప ఎన్నికకు మే 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



# రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఆగస్టు 15వ తేదీ లోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ గురువారం హసన్ పర్తి మండల పరిధిలోని వంగపాడు, రెడ్డిపురం గ్రామ రైతులు సీఎం నిలువెత్తు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సూర్యుడు అటునుంచి ఇటు పొడిచినా, భూమండలం బద్దలైనా రుణ మాఫీ చేసి తీరుతానంటూ రేవంత్ రెడ్డి ప్రకటించడై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటినుంచి రైతులకు అండగా నిలుస్తుందన్నారు. సముద్రాల మధు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మరిపెల్లి శ్రీనివాస్, రమేష్, జయపాల్ రెడ్డి, సారయ్య, సమ్మయ్యలతోపాటు పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికలపై ప్రత్యేక నిఘా

## ఫిర్యాదులు, సలహాల కోసం పరిశీలకుల నియామయం

## రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల ఫిర్యాదులు, సలహాలు, సూచనలకోసం పరిశీలకులను సంప్రదించవచ్చని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ ఎస్సి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలో స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి మొత్తం ఏడు అసంబ్లీ సెగ్మెంట్ లు ఉన్నాయి. ఇందుకుగాను ఫిర్యాదులు, సలహాలకోసం ఎన్నికల సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఐఏఎస్ అధికారి బండారి స్వాగత్ రణవీర్ చంద్ సెల్ నంబర్ 8247524267, పోలీసు పరిశీలకులు నవీన్ సాయి మొబైల్ నంబర్ 9855127500 లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com